సాక్షి
అనంతపురం
ఆదివారం । 5 । మే । 2024





అన్నా నమస్తే: జగన్‌ను చూసిన ఆనందంలో యువత

మరిన్ని ఫొటోలు 10లో ▶

పురం.. జనసాగరం

- సీఎం జగన్ సభకు వెల్లువలా జనం
- జగన్నినాదంతో మార్మోగిన హిందూపురం
- ఉదయం 10 గంటలకే ఇసుకేస్తే రాలనంత జనం
- జగన్ అభిమానుల తాకిడికి చిన్నబోయిన సూరీడు
- అధినేతకు ఘన స్వాగతం పలికిన నాయకులు
- కార్యకర్తలకు ఊపునిచ్చిన వైఎస్ జగన్ ప్రసంగం
- ఆద్యంతం ఈలలు వేస్తూ మద్దతు తెలిపిన జనం
- సంతోషంతో ఆడిపాడిన కార్యకర్తలు, ప్రజలు

ఎటు చూసినా జనం..అందరిలోనూ ఉరిమే ఉత్సాహం.. దిక్కులు పిక్కటిల్లేలా జగన్నినాదం.. దారులన్నీ ఒక్కటికాగా హిందూపురం జనసాగరమైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం హిందూపురం రాగా, పట్టణం జనంతో పోటెత్తింది. జననేతపై జనానికి ఉన్న అభిమానం ముందు భగభగ మండే భానుడు సైతం చిన్నబోయాడు. జగనన్నను దగ్గరి నుంచి చూడాలన్న మహిళల అభిమానం ముందు.. బారికేడ్లు చెల్లాచెదురయ్యాయి. అభిమాన నేతను చూశామన్న ఆనందంతో చిన్నాపెద్దా ఆడిపాడుతూ... హిందూపురంలో ఫ్యాన్స్ గాలి ఎలా ఉంటుందో చాటి చెప్పారు.



చీమకూ సందులేదు: హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో సీఎం జగన్ బహిరంగసభలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఆదరించండి : పురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని కోరుతున్న వైఎస్ జగన్



ఆశీర్వదించండి : ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపికను అసెంబ్లీకి పంపాలని కోరుతున్న జగన్



ఆనందోత్సాహం: బహిరంగ సభలో యువతుల నృత్యం



జనం జెండా: వైఎస్సార్ సీపీ జెండాలతో మహిళలు



హమారా భయ్యా: జగన్ చిత్రాన్ని సెల్‌ఫోన్‌లో బంధిస్తూ..

సీఎం పర్యటన సాగిందిలా..

- ఉదయం 10.50 గంటలు: సీఎం వైఎస్ జగన్ పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకున్నారు.
- 11 గంటలు : పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో హిందూపురం బయలుదేరారు.
- 11.25 గంటలు : హిందూపురంలోని ఎంజీఎం మైదానంలో హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- 12 గంటలు : అంబేడ్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ వద్దకు వచ్చారు
- 12.10 గంటలు : అశేష జనవాహినిని ఉద్దేశించి సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించారు.
- 12.50 గంటలు : ప్రసంగం ముగించారు.
- 1.25 గంటలు : ఎంజీఎం మైదానం నుంచి హెలికాప్టర్‌లో పలమనేరు బయలుదేరి వెళ్లారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

హిందూపురం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలో తాము నడిచేందుకు సిద్ధమయ్యామని పలువురు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురం రాగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ మనోహర్, ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆదిమూర్తి, అమానుల్లా తదితరులు 200 మంది కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి సీఎం జగన్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

సాక్షి, పుట్టపర్తి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో శనివారం హిందూపురం మురిసి పోయింది. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరాగా పట్టణం కిక్కిరిసింది. బస్టాండు వద్ద నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు వీధులన్నీ జనంతో పోటెత్తాయి. అభిమానుల సందడితో 'పురం'లో విజయోత్సాహం కనిపించింది.

దారి పొడవునా అపూర్వ స్వాగతం..

పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం నుంచి సీఎం వైఎస్ జగన్ హెలికాప్టర్‌లో బయలుదేరి స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎంజీఎం మైదానం నుంచి బస్సులో బయలుదేరిన వైఎస్ జగన్‌కు అభిమానులు దారిపొడవునా అపూర్వ స్వాగతం పలికారు. ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపైనే నిలబడి 'జై జగన్' అంటూ నినదించారు. కొందరు మహిళలు దూరం నుంచే సీఎం ప్రయాణించే బస్సుకు గుమ్మడికాయలతో దిష్టి తీశారు. అప్పటికే అంబేడ్కర్ సర్కిల్ నుంచి మేళాపురం సర్కిల్ వరకు.. మరోవైపు పరిగి బస్టాండ్ వరకు ఇసుకేస్తే రాలనంత జనంతో రహదారులన్నీ నిండిపోయాయి. సీఎం జగన్ స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకోగానే అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు 'జై జగన్.. జై జై జగన్' అంటూ నినదించారు. మధ్యాహ్నం 12 గంటల వేళ ఎర్రటి ఎండలోనూ కట్టుకదలకుండా సీఎం ప్రసంగం విని తమ సంకల్పం ఎంత గొప్పదో చాటారు. సీఎం ప్రసంగం ఆద్యంతం ఈలలు వేస్తూ మద్దతు తెలిపారు. జగన్ ఫ్యాన్ చూపించగానే 'ఫ్యాన్స్' ఆనందంతో చిందులు వేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బహిరంగ సభలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కేవీ ఉషశ్రీచరణ్, రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, హిందూపురం పార్లమెంటు అభ్యర్థి జె.శాంత, హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక, మడకశిర అభ్యర్థి ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా, నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, గుడ్డంపల్లి వేణురెడ్డి, మధుమతిరెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు మన్సూర్, రాము, నారాయణస్వామి, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలోనూ ఘన స్వాగతం..

అంతకుముందు పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రి పెద్దిరెడ్డి, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీచరణ్, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక తదితరులు



వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు



అభిమాన సంద్రం: జగన్ బస్సు వెంట పరుగుతీస్తున్న అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు

పేదల పక్షాన నిలిచింది జగనే



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో పేదల పక్షాన నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిలిచారు. ప్రస్తుతం ఆయన తనయుడు జగనన్న ఉన్నారు. పేదలందరి పక్షాన.. జగన్ ఒక్కరే పోరాటం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలకు పెద్దపీట వేసి సామాజిక సమన్యాయం తీసుకొచ్చారు. జనం మెచ్చిన నేత జగనన్న. మరోసారి జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులా.. అండగా నిలిచారు. వైఎస్ జగన్ కోసం ప్రతి ఒక్కరూ.. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని కోరుతున్నా.

– జె.శాంత, వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంటు అభ్యర్థి

బాలయ్యను సాగనంపుదాం



హిందూపురం నియోజకవర్గానికి చుట్టపుచూపుగా వచ్చే బాలకృష్ణను సాగనంపుదాం. స్థానికంగా ఉంటూ ప్రజా సమస్యల్లో ప్రతి ఒక్కరికీ తోడుంటా. నన్ను ఆశీర్వదించండి. జగనన్న గత ఐదేళ్లలో అమలు చేసిన పథకాలతో ప్రజల్లోకి వెళ్లి.. మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం. వైఎస్ జగన్ సీఎంగా ఉంటే సంక్షేమ పథకాలన్నీ ముంగిటకే వస్తాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సమన్యాయం చేసింది జగన్ ఒక్కరేనని గర్వంగా చెప్పుకోవచ్చు. మహిళా సాధికారతకు జగన్ పెద్దపీట వేశారు. మహిళల అభివృద్ధికి ఎన్నో పథకాలు తీసుకొచ్చారు. జనరల్ స్థానాల్లో కూడా బీసీ మహిళలకు సీట్లు ఇచ్చారు. టీడీపీకి బీజేపీ, జనసేన తోడుగా వస్తున్నాయి. కానీ జగన్ సింహంలా సింగిల్ గానే బరిలో దిగుతున్నారు.

– టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

అనంతపురం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సూచించారు. రాప్తాడు అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక పంగల్ రోడ్డులోని టీటీడీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన, ఇతర జిల్లాలకు చెందిన వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలో రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి మూడు మండలాలు ఉన్నాయని, మిగిలిన మండలాలు శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్నాయన్నారు. ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే విషయంలో కొద్దిపాటి గందరగోళం ఉందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని పోలింగ్ సిబ్బంది, అభ్యర్థులు కోరారన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన వారు ఇక్కడికి శిక్షణకు వచ్చామని, ఇక్కడే ఓటు హక్కు కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై ఆ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నివేదిక తెప్పించుకున్నామన్నారు. వారికి ఇక్కడ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి నిబంధనలు మారిన నేపథ్యంలో అవగాహన పొందాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని ఫారం-12 ఇచ్చిన ఉద్యోగులందరికీ వాయిస్ కాల్, మెసేజ్ ద్వారా తెలియజేశామన్నారు. కార్యక్రమంలో రాప్తాడు రిటర్నింగ్ అధికారి వసంతబాబు తదితరులు ఉన్నారు.



టీటీడీసీ కేంద్రంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నీటి టబ్బులో పడి చిన్నారి మృతి

చెన్నేకొత్తపల్లి: టబ్బులో ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం యర్రజినన్నగారిపల్లి (కొండకింద పల్లి) గ్రామానికి చెందిన బొగ్గు మురళి, అరుణ దంపతులకు ఓ కుమార్తెతో పాటు 14 నెలల వయసున్న కుమారుడు ఉన్నారు. శనివారం వేసవి తాపం అధికంగా ఉండడంతో సాయంత్రం టబ్‌లో నీరు పోసి అందులో కుమారుడిని కూర్చొబెట్టి తల్లి ఆడించింది. ఈ క్రమంలోనే పనిపై చిన్నారిని టబ్‌లోనే వదిలేసి ఇంట్లోకి వెళ్లిన ఆమె బయటకు వచ్చి చూసే లోపు నీట మునిగి బాలుడు మృతి చెందాడు.

తాడిపత్రిపై భానుడి ప్రతాపం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా అంతటా శనివారం భానుడు మండిపోయాడు. తాడిపత్రిపై అయితే, మరింతగా విరుచుకుపడ్డాడు. పట్టణంలో 45.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో 'అనంత' అగ్నిగుండంలా కాగుతోంది. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కారణంగా జిల్లా వాసులు అట్టుడికిపోతున్నారు. మరీ ముఖ్యంగా జిల్లా కేంద్రంతో పాటు తూర్పు, ఉత్తర మండలాల్లో వేసవితాపం తీవ్రస్థాయికి చేరుకుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా ఉమ్మడి జిల్లా అంతటా 26 నుంచి 33 డిగ్రీల వరకు నమోదవుతుండడం గమనార్హం. గాలిలో తేమశాతం మధ్యాహ్న సమయంలో 18 నుంచి 25 శాతం రికార్డు కాగా, వడగాల్పులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో జనానికి ఊపిరాడకుండా చేస్తున్నాయి. ఆదివారం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని భారత వాతావరణ శాఖ ప్రకటించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు.

క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు


రాప్తాడు నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న దీపక్ రామచంద్ర తవారే, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు దీపక్ రామచంద్ర తవారే సూచించారు. శనివారం ఆయన జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్‌తో కలసి జేఎన్‌టీయూఏలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, కమిషనింగ్ రూమ్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ రూమ్‌ల్లో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల రాకపోకలకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకు ముందు ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రాప్తాడు ఆర్‌ఓ వసంతబాబు పాల్గొన్నారు.

చైతన్యానికి అడ్డా.. గుంతకల్లు గడ్డ


గుంతకల్లు: ఉద్యమాల పుట్టినిల్లుగా గుంతకల్లు నియోజకవర్గం ఖ్యాతిగాంచింది. 1942లో మహాత్ముడి పిలుపునందుకుని బ్రిటీష్ వారిని భారతదేశం వదలి పొమ్మంటూ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమంలో విజయమో... వీరస్వర్గమో అంటూ నియోజకవర్గ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ సమయంలో గుంతకల్లులోని రైల్వేస్టేషన్‌ను ధ్వంసం చేసిన ఘటనలో కసాపురం గ్రామానికి చెందిన మహ్మమద్‌రసూల్ ఆరుమాసాలు జైలు శిక్ష అనుభవించారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమం మొదలు ఇటీవల ప్రత్యేక హోదా సాధన పోరు వరకూ గుంతకల్లు నియోజకవర్గ ప్రజలు చూపిన ఉద్యమ స్ఫూర్తి అందరికీ ఆదర్శం.

2009 నుంచి నియోజకవర్గ కేంద్రంగా..

1957 నుంచి 2008 వరకు గుత్తి నియోజకవర్గంలో గుంతకల్లు ఉండేది. అప్పట్లో తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని పెద్దవడుగూరు మండలంలో ఉన్న సగం పల్లెలు గుత్తి నియోజకవర్గంలో ఉండేవి. గుంతకల్లు, పామిడి మండలంలోని పలు గ్రామాలు ఉరవకొండ నియోజకవర్గంలో ఉండేవి. ఈ గందరగోళానికి తెరదించుతూ పెద్దవడుగూరు మండలం మొత్తాన్ని తాడిపత్రిలోకి, ఉరవకొండ నియోజవర్గంలోని గుంతకల్లు, పామిడి మండలాల్లోని మొత్తం గ్రామాలను కలుపుకుని 2009లో గుత్తి నియోజకవర్గాన్ని గుంతకల్లు నియోజకవర్గంగా మార్పు చేశారు. గుత్తి నుంచి గుంతకల్లు నియోజకవర్గ ఆవిర్భావం అనంతరం 2019 వరకు 14 సార్లు శాసనసభ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ అభ్యర్థులు 4 సార్లు, టీడీపీ అభ్యర్థులు 5 సార్లు గెలపొందగా, ఒకసారి సీపీఐ, మరో మూడు సార్లు స్వతంత్ర అభ్యర్థులు, ఓసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ప్రజలు పట్టం కట్టారు. కమ్యూనిస్టు యోధుడు వీకే అదినారాయణరెడ్డి 1962లో గుత్తి ఎమ్మెల్యేగా గెలిచారు. 1972లో స్వతంత్ర అభ్యర్థి దుద్దెకుంట వెంకటరెడ్డి, 1978లో కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరామయ్య, 1983లో టీడీపీ అభ్యర్థి పత్తి రాజగోపాల్, 1995లో టీడీపీ అభ్యర్థి ఎన్. గాదిలింగప్ప, 1989లో కాంగ్రెస్ అభ్యర్థి అరికేరి జగదీష్, 1994 టీడీపీ అభ్యర్థి ఎన్. గాదిలింగప్ప, 1999లో టీడీపీ అభ్యర్థి ఆర్.సాయినాథ్‌గౌడ్, 2004లో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.నీలావతి, 2009లో గుంతకల్లు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కొట్రికే మధుసూదన్‌గుప్తా, 2014లో టీడీపీ అభ్యర్థి ఆర్.జితేంద్రగౌడ్ గెలుపొందారు. అయితే 2019 జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్.జితేంద్రగౌడ్ పై దాదాపు 48,500 పైచిలుకు ఓట్ల భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి విజయం సాధించారు.

నియోజకవర్గ స్వరూపం...

గుంతకల్లు నియోజకవర్గం దాదాపు 277.69 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ కేంద్రంతోపాటు రైల్వే డివిజనల్ కార్యాలయానికి నిలయం. గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌కు దక్షిణం వైపు కర్నూలు జిల్లా మద్దికెర, తుగ్గలి, తూర్పు వైపు తాడిపత్రి నియోజకవర్గం, ఉత్తర, పడమర వైపు ఉరవకొండ నియోజకవర్గం సరిహద్దులుగా ఉన్నాయి. బలమైన వ్యవసాయ, వాణిజ్య రంగాలకు గుంతకల్లు నియోజకవర్గం ప్రసిద్ధి పొందింది. గుంతకల్లు రైల్వే డివిజన్ కేంద్ర బిందువు కావడంతో ఇక్కడ వివిధ రాష్ట్రాల ప్రజలతో విభిన్న సంస్కృతి నెలకొని ఉంటుంది. గుంతకల్లు నుంచి ఉత్తర, దక్షిణ భారతదేశంలో ఎక్కడికైనా వెళ్లడానికి రైలు మార్గం ద్వారా మంచి కనెక్టివిటీ ఉంది.


గుత్తి కోట

నియోజవర్గ ప్రత్యేకతలు..



- కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధి పొందింది. ఏటా శ్రావణ, కార్తీక మాసాల్లో ప్రతి శని,మంగళ వారాల్లో దేవాలయానికి ఏపీ, తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలివస్తారు.
- నియోజకర్గంలోని గుత్తికోట అత్యంత పురాతనమైన దుర్గాల్లో ఒకటి. 7వ శతాబ్దానికి చెందినదిగా ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. గుత్తి కోట సందర్శనకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు.
- గుత్తి మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సేవాగఢ్ సంత్‌సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్నాడు. ఏటా జరిగే జయంత్యుత్సవాలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలసంఖ్యలో బంజారాలు తరలివస్తుంటారు.
- గుంతకల్లు పట్టణంలోని మస్తానయ్య దర్గా కులమతాలకు అతీతంగా ఖ్యాతిగాంచింది. ఏటా జరిగే మస్తానయ్య ఉరుసులో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుంటారు.
- పామిడి వస్త్ర రంగానికి ప్రసిద్ధి, ఈ గ్రారమంలోని సగం జనాభా వస్త్ర వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. దీంతో పామిడిని రెండో ముంబాయిగా పిలుస్తుంటారు.

ప్రస్తుతం గుంతకల్లు బరిలో వీరే..


వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైవీఆర్

గుంతకల్లు నియోజకవర్గ అసెంబ్లీ బరిలో 14 మంది ఉన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా కె.ప్రభాకర్, టీడీపీ అభ్యర్థిగా గుమ్మనూరు జయరాం, బీఎస్పీ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ మాలిక్, సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థిగా జనగాం కృష్ణ, భారతీయ చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా శశిభూషణ్ రెడ్డి, జైభీమ్ రావు భారతీయ పార్టీ అభ్యర్థిగా పి.రహిమతోపాటు ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు.

నియోజకవర్గ సమాచారం

సచివాలయాలు:	96
రైతు భరోసా కేంద్రాలు:	79
వెటర్నరీ కేంద్రాలు:	38
వెటర్నరీ ఆసుపత్రులు:	10
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు:	91
ఎస్‌ఎంలు:	734

ఈ నాలుగున్నరేళ్లలో గుంతకల్లు నియోజకవర్గంలో వివిధ పథకాలతో లబ్ధి

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	37,742	501.03
వైఎస్సార్ రైతు భరోసా	30,179	192.02
సున్న వడ్డీ పట్టా రైతులు	24,472	5.56
వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్	15,208	98.11
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	7,243	7.822
జగనన్న తోడు	17,601	23.86
వైఎస్సార్ ఆసరా	1,36,351	120.81
వైఎస్సార్ చేయూత	42,868	136.75
వైఎస్సార్ బీమా	983	14.70
వైఎస్సార్ సున్నా వడ్డీ	1,26,133	19.85
ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజ్	73,020	523.93
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	49,940	78.44
జగనన్న అమ్మ ఒడి	29,669	82.58
జగనన్న విద్యా కానుక	1,41,196	23.83
వైఎస్సార్ నేతన్న హస్తం	415	4.73
జగనన్న వసతి దీవెన	26,708	25.13
జగనన్న విద్యా దీవెన	27,127	55.24
జగనన్న చేదోడు	7,333	7.33
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3,401	5.10
వైఎస్సార్ కాపు నేస్తం	2,266	3.40
అర్చకులు, ఇమాంలు, పాస్టర్లకు సాయం	316	3.19
వైఎస్సార్ లా నేస్తం	29	0.174
వైఎస్సార్ వాహన మిత్ర	6,296	6.296
జగనన్న గోరు ముద్ద	26,218	9.72
జగనన్న గృహాలు	11,365	170.48
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	26,928	57.18



నియోజకవర్గ ఓటర్ల వివరాలు...

పురుషులు	మహిళలు
1,32,943	1,37,630
ఇతరులు	మొత్తం ఓటర్లు
75	2,70,648



మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విశ్వ, శంకరనారాయణ


జీడిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ, చిత్రంలో శంకరనారాయణ

బెళుగుప్ప: మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని, గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ అసెంబ్లీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, అనంతపురం ఎంపీ అభ్యర్థి ఎం.శంకరనారాయణ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్‌తో కలసి శనివారం బెళుగుప్ప మండలం జీడిపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని వారు నిర్వహించారు. 2014 ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోలోని ఏ ఒక్క హామీని చంద్రబాబు నెరవేర్చలేదని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో వరుణుడు సైతం ముఖం చాటేస్తాడన్నారు. కరువు, చంద్రబాబు రెండూ కవలపిల్లలన్నారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కూడా ఐదేళ్లకు ఒకసారి మాత్రమే ప్రజలకు కన్పిస్తారని, మిగిలిన రోజుల్లో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా హైదరాబాద్, విజయవాడకే పరిమితమవుతారన్నారు. జీడిపల్లి ముంపు గ్రామాన్ని ఆదుకునేగా ఉరవకొండ సభా వేదిక ద్వారా రూ 82.6 కోట్లు మంజురు చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే నిధులు మంజూరు చేసి జీడిపల్లి నిర్వాసితులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, పార్టీ రాష్ట్ర నాయకులు త్రిలోక్‌రెడ్డి, రామాంజినేయులు, శివలింగప్ప, శ్రీనివాసులు, మండల కన్వీనర్ మచ్చన్న, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, హనమంతరాయుడు, గంగన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి అనుమానాస్పద మృతి


మృతుడు రామాంజినేయులు

తాడిపత్రి: ఎన్నికల విధుల్లో భాగంగా శిక్షణకు వచ్చిన ఉపాధ్యాయుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న మద్ద రామాంజనేయులు (55) ఉరవకొండలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య మాలతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. షుగర్ వ్యాధితో బాధపడుతున్న ఆయనకు రోజూ వేకువజామున వాకింగ్‌కు వెళ్లే అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున కడప మార్గంలో వాకింగ్‌కు వెళ్లిన ఆయన శివాలయం వద్ద రహదారి పక్కన మృతదేహమై కనిపించారు. అటుగా వెళుతున్న వాహనదారులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

మద్యం తరలిస్తూ పట్టుబడిన టీడీపీ నేత


టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుతో నిందితుడు రంగప్ప (ఫైల్)

రాయదుర్గం: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ గుమ్మఘట్ట మండలం చెరువుదొడ్డికి చెందిన టీడీపీ నేత రంగప్ప పట్టుబడ్డాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. శనివారం ఉదయం మారెమ్మ ఆలయం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి వచ్చిన కేఏ13 ఎం 5417 నంబర్ ఇండికా కారును పోలీసులు అడ్డుకుని పరిశీలించారు. అందులో 11 బాటిళ్ల కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న రంగప్పపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.

బాబు బూటకపు హామీలు నమ్మకండి

- బీఈడీ, పీఈటీ అభ్యర్థుల అసోసియేషన్ నాయకుల పిలుపు


విలేకరులతో మాట్లాడుతున్న బీఈడీ, పీఈటీ అభ్యర్థుల అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలనే ఉద్దేశంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు బూటకపు హామీలతో మరోసారి నిరుద్యోగులను వంచించే ప్రయత్నం చేస్తున్నారని, వీటిని ఎవరూ నమ్మరాదని బీఈడీ, పీఈటీ అభ్యర్థుల అసోసియేషన్ నాయకులు మండిపడ్డారు. శనివారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. మెగా డీఎస్సీపై తన మొదటి సంతకం, నిరుద్యోగ భృతి రూ. 3 వేలు, 20 లక్షల ఉద్యోగాల నియామకం లాంటి హామీలతో చంద్రబాబు ప్రకటించిన మేనిఫోస్టు ఓ బూటకమని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు చేసిన మోసాలను, కుట్రలను ఆధారాలతో సహా మీడియాకు చూపించారు. లక్షలాదిమంది నిరుద్యోగులు ఉపాధి లేక వయోపరిమితి దాటి కూలి పనులతో జీవనం సాగించే పరిస్థితులను చంద్రబాబు కల్పించారని ధ్వజమెత్తారు. మరోసారి చంద్రబాబు మాయలో పడి ఓట్లు వేస్తే అది నిరుద్యోగుల పాలిట శాపంగా మారుతుందని హెచ్చరించారు. సచివాలయాలను ఏర్పాటు చేసి 1.27 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన సీఎం వైఎస్ జగన్ ఎంతో నిజాయితీతో పాలన సాగించారన్నారు. వైద్యరంగంలో డాక్టర్లు, నర్సులు పారా మెడికల్ సిబ్బంది 70 వేల పోస్టులను భర్తీ చేశారన్నారు. గ్రూప్-1, 2, 3, డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చారన్నారు. నిరుద్యోగులంతా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుని అందరికీ మంచి చేసే నాయకుడికి మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు సి.హనుమన్న, ఎన్‌సీ నరసింహులు, వెంకటేశులు, హరినాయక్, రవిశేఖర్, లాలూ ప్రసాద్ నాయక్, వెంకటేశ్వర్లు, శివ బాలాజీనాయక్, ఎం. కృష్ణప్ప, శివానంద, అంజి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య


మృతుడు జనార్దన్

గుత్తి/తాడిపత్రి: జిల్లాలోని గుత్తి, తాడిపత్రి ప్రాంతాల్లో రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు... గుత్తి మండలం శ్రీపురం గ్రామానికి చెందిన జనార్దన్ (46) రెండేళ్లుగా గుత్తి ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీలో నివాసముంటున్నాడు. అర్థిక సమస్యలు తలెత్తడంతో మానసికంగా కుదేలైన ఆయన శనివారం ఉదయం ఎంఎంస్ హైస్కూల్ సమీపంలోని పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

- తాడిపత్రిలోని శ్రీనివాసపురానికి చెందిన రఫీ, రషీదా దంపతుల కుమారుడు షాహిద్ బాషా (20) ఇంటర్ పూర్తి చేశాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇంటి పట్టునే ఉంటున్నాడు. కొంత కాలంగా మానసిక స్థిమితం కోల్పోయి అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన షాహిద్ బాషా అర్ధరాత్రి సమయంలో యల్లనూరు - పుట్లూరు మార్గంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని తాడిపత్రి స్టేషన్ మాస్టర్‌కు లోకో పైలట్ తెలపడంతో శనివారం ఉదయం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు.

సమస్యాత్మక గ్రామంలో ఎస్పీ పర్యటన


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ అమిత్ బర్ధార్

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పరిస్థితులు కల్పించినట్లు ఎస్పీ అమిత్ బర్ధార్ తెలిపారు. పెద్దవడుగూరు మండలంలో సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన క్రిష్టిపాడులో శనివారం ఆయన పర్యటించారు.పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని గొడవలకు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. రౌడీషీటర్లకు, సమస్యలు సృష్టించే వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య, తాడిపత్రి రూరల్ యుపీఎస్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్ఐ సాగర్, పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



రాజీనామా లేఖను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి, ఊటకల్లు గ్రామాలకు చెందిన 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. శనివారం రాజీనామా లేఖలను ఎంపీడీఓ శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అనంతపురం ఎంపీగా శంకర్‌నారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. మళ్లీ జగనన్నను సీఎం చేయడమే తమ లక్ష్యమన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

గుంతకల్లు: సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమానికి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం ఐటి విభాగం ఆధ్వర్యంలో రైల్వే క్వాటర్స్, రైల్వే క్రీడా మైదానం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతోపాటు సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీ విభాగం నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో హెల్పర్



కూడేరు: టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లక్ష్మమ్మ

కూడేరు: మండలంలోని ఇప్పేరు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం హెల్పర్ పంజు లక్ష్మమ్మ ఎన్నికల నిబంధన ఉల్లంఘించారు. గత నెల 26న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ కుమారుడు జయసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఈమె పాల్గొంది.

నేడు భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశం

గుంతకల్లుటౌన్: భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు మేస్త్రీ దొడ్డప్ప ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్‌అండ్‌బీ సర్కిల్‌లో భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ కౌన్సిలర్ మేస్త్రీ రంగన్న శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, రాడ్‌బెండర్స్, తదితరులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలనిన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



అయ్యవారుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతకల్లు రూరల్: సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శనివారం మండంలోని అయ్యవారుపల్లి ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రచారాన్ని చేశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాష్ట్ర కో కన్వీనర్ భీమలింగ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా విస్తృత ప్రచారం



వజ్రకరూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

వజ్రకరూరు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా విస్తృత ప్రచారం చేశారు. గ్రామంలోని పట్వావారివీధి, కుమ్మరవీధి, ఆస్పత్రి వీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీనాయకులు మోనాలిసా, శశాంక్‌రెడ్డి, రామానాయుడు, ఉస్మాన్, రవికాంతరెడ్డి, నల్లబోతులరాజు, అచ్చనాల మధుసూదన్, రాకెట్ల బాబు, నెట్టికల్లు, నల్లబోతుల కిరణ్, రఘుపతి,జిరాక్స్ శివ,రమేష్, ప్రభుదాస్, సునీల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



వైవీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు



గుత్తి: రజకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని 5వ వార్డుకు చెందిన పార్టీ నాయకురాలు మేరీ ఆధ్వర్యంలో సుమారు 80 మంది వైఎస్సార్‌సీపీలోకి చేరారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో వార్డుకు చెందిన మాధవి, భావన, రవి, ఉమా, మల్లికార్జున, ఆనంద్, లక్ష్మి, వాణి,ఇందు, సుజాత తదితరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ మైనార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్: ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సమక్షంలో పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ సెల్ పార్లమెంట్ సెక్రటరీ హాఫీజ్ ఖాజా బందానవాజ్, నజీర్‌తో పాటు 40 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హుసేన్ బాషా, నూర్‌మహ్మద్, షేక్‌బాషా, సురేష్‌గౌడ్, దేవేంద్రగౌడ్, సుశీలమ్మ, సావిత్రమ్మ, అంజినమ్మకు ఎమ్మెల్యే వైవీఆర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో 2వ వార్డు ఇన్‌ఛార్జ్ పీఎస్.మస్తాన్, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌ఛార్జ్ జింకల రామాంజినేయులు, మైనార్టీ నాయకులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, దౌలా, తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలను పరిష్కరిస్తా..

గుత్తి: రజకుల సమస్యలను పరిష్కారిస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న గంగమ్మ దేవాలయంలో శనివారం రజక కులస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగప్ప, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, , జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, బళ్లారి రాజ్‌కుమార్ రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, దేవేంద్రప్ప, సీవీ రంగారెడ్డి, బేడల వెంకటరాముడు, అశ్వ చిన్న మారెన్న, అశ్వ సురేష్, సూరి, రజక సంఘం మండల అధ్యక్షుడు నాగప్ప , పట్టణ మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, హేమలత, డాక్టర్ శాంతిప్రియ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రజకులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. గెలిచిన వెంటనే రజకుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానన్నారు. రజక కల్యాణ మండపాన్ని నిర్మిస్తానన్నారు, ధోబీ ఘాట్‌కు అర ఎకరా స్థలం కేటాయిస్తానన్నారు. బీసీ కాలనీలో రజకులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల విషయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. ప్రస్తుతమున్న వారికే హక్కు, అధికారం ఉంటుందన్నారు. రజకులందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి, వేయించి గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు.

నాలుగు మాసాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం

గుత్తిలో తాగునీటి సమస్యను కేవలం నాలుగు మాసాల్లో శాశ్వతంగా పరిష్కరిస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. గుత్తిలో తాగునీటి సమస్య పరష్కారం కోసం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.173 కోట్లు కేటాయించారన్నారు. ఈ నిధులతో మిడ్ పెన్నార్ నుంచి పైప్ లైన్ ద్వారా గుత్తికి నీరు తీసుకొచ్చే ప్రాజెక్ట్ పనులు సుమారు 70 శాతం పూర్తయ్యాక కాంట్రాక్టర్ తప్పుకున్నాడన్నారు. పనులు పూర్తి కాక తాగు నీటి సమస్య నెలకొందన్నారు. అయితే ప్రతిపక్షాల నాయకులు దీన్ని రాజకీయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా మరోసారి అవకాశమిస్తే తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానన్నారు భూ కబ్జాదారుడు(గుమ్మనూరు జయరాం) కావాలో, సౌమ్యుడైన తాను కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, మైనార్టీ జిల్లా నాయకుడు మైనుద్దీన్, పార్టీ పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, సీవీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైబిల్ మిషన్ చర్చిలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

గుత్తి పట్టణంలోని లచ్చానపల్లి రోడ్డులో ఉన్న బైబిల్ మిషన్ చర్చి (స్వస్థత శాల, అద్భుత కుమార్ చర్చి) లో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల్లో గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరోసారి సీఎం జగన్ కావాలని, గుంతకల్లు ఎమ్మెల్యేగా వై. వెంకటరామిరెడ్డి గెలవాలని పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్ ప్రార్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నాయకులు రాజ్‌కుమార్ రెడ్డి, గురు ప్రసాద్‌యాదవ్, దేవేంద్రప్ప, పట్టణ మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, బలిజ సంఘం అధ్యక్షురాలు కందుల హేమలత, నాయకులు పవన్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు వరద రాజులు, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలోని బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ అద్భుతకుమార్ ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే వైవీఆర్

సంక్షేమ ప్రభుత్వాన్ని స్వాగతించండి



కోనంపల్లి గ్రామంలో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు



కోనంపల్లిలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణ

బెళుగుప్ప: త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ పాలనను స్వాగతించాలని ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ ఓటర్లను కోరారు. శనివారం బెళుగుప్ప మండల పరిధిలోని కోనంపల్లి, జీడిపల్లి, వీరాంజనేయకొట్టాల, కాలువపల్లి, హనిమిరెడ్డిపల్లి, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, పార్టీ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతి గ్రామంలోనూ పార్టీ నాయకులు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ గజమాలలతో స్వాగతించారు. రోడ్ షోలతో పాటు ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, రాష్ట్ర నాయకులు త్రిలోక్‌రెడ్డి, రామాంజనేయులు, శివలింగప్ప, శ్రీనివాసులు, మండల కన్వీనర్ మచ్చన్న, మారుతమ్మ, పెద్దన్న, అంజినమ్మ, ప్రభావతి, నాగిరెడ్డి, ఎర్రిస్వామి, ఫకృద్దీన్, అనంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిమ్మన్నమ్మ, శ్రీధర్, చంద్రారెడ్డి, ఎర్రిస్వామి, వెంకటేశులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, నాగేష్, ఎర్రిస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

విశ్వన్నను ఆదరించండి

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో ఎమ్మెల్యేగా వై.విశ్వేశ్వరరెడ్డికి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎస్ ఎంపీపీ బోయ ఓబులేసు, ఎంపీటీసీలు దాసరి వెంకటేశులు, పాటిల్ శివగౌడ్, సర్పంచు రాజశేఖర్ ప్రచారం చేశారు. గడేకల్లు, ఎస్.తిమ్మాపురం, డొనేకల్లు, పొలికి, వేల్పుమడుగు, విడపనకల్లు, కరకముక్కల, హావళిగి, చీకలగురికి, వి.కొత్తకోట, ఆర్.కొట్టాల, మాళాపురం,పెద్ద కొట్టాలపల్లి, గాజుల మల్లాపురం, హంచనహాల్ తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతు, భరత్‌రెడ్డి, రామాంజనరెడ్డి, కరణం భీంరెడ్డి, సుంకన్న, బోయశ్రీరాములు, నారాజురెడ్డి, నవీన్‌రెడ్డి, సుంకిరెడ్డి, తిమ్మారెడ్డి, బోయ పెద్దన్న, నగేష్, ఎర్రెప్ప, లక్ష్మిరెడ్డి, చిట్టిబాబు, లింగేశ్వర, మహేశ్ స్వామి, శేషిరెడ్డి, అశోక్‌రెడ్డి, హేమంత్ సునీల్ రెడ్డి, మేకల రామాంజి నేయులు, ఎంపీటీసీలు ఓబుళేసు,తిమ్మరాజు,ప్రసాదు, హంపయ్య, యువరాజు పాల్గొన్నారు.

నేడు పాల్తూరులో ఎన్నికల ప్రచారం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ఇంటింటా ప్రచారం చేయనున్నట్లు ఎంపీపీ కరణం పుష్పావతి,పార్టీ కన్వీనర్ బసన్న, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ బోయ ఓబుళేసు శనివారం తెలిపారు.

అసమర్థ కేశవ్‌ను సాగనంపండి





చిన్నముష్టూరు రోడ్‌షోలో మాట్లాడుతున్న ప్రణయ్‌రెడ్డి, చౌడేశ్వరి కాలనీలో ప్రచారం చేస్తున్న ప్రణయ్‌రెడ్డి

- ఎన్నికల ప్రచార సభల్లో యువనేత వై.ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: ముప్పై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న పయ్యావుల కేశవ్ నియోజకవర్గానికి చేసిందేమీలేదని, కనీసం సొంతూరుకు రోడ్లు కూడా వేసుకోలేకపోయాడని యువనేత ప్రణయ్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని కోనాపురం, చిన్నమూష్టూరు, బూదగవి గ్రామాల్లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం, రోడ్‌షో కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నముష్టూరు, బూదగవి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రోడ్‌షోలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు తేడా ప్రజలే గమనించాలని కోరారు. మంచి చేసిన వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, మార్కెట్‌యార్డు వైఎస్ చైర్మన్ సుంకన్న, పార్టీ యువనాయకులు మాసినేని నరేష్, సర్పంచ్ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ బాబు, మాజీ ఎంపీటీసీ లాలు, బూదగవి సర్పంచ్ లక్ష్మిదేవి, గ్రామ నాయకులు ధనంజయ, భీమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రణయ్‌రెడ్డి విస్తృత ప్రచారం

ఉరవకొండ: పట్టణంలోని చౌడేశ్వరీకాలనీ, సాయినగర్, శాంతినగర్‌లో యువనేత ప్రణయ్‌రెడ్డి శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ముందుగా చౌడేశ్వరీ కాలనీలో చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ప్రణయ్‌రెడ్డికి మాజీ ఎంపీపీ చంద్రమ్మ, వార్డు సభ్యురాలు కణేకల్లు షాహెనాజ్, కణేకల్లు రఫీక్, కణేకల్లు యూసుఫ్, ఆర్‌సీ ప్రసాద్, బొజ్జన్న, శేఖర్, గోవిందు తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, కోఆప్షన్ సభ్యులు పామిడి సలీం, పామిడి తయ్యాబ్, బళ్లారి ఆసీఫ్, చెంగల మహేష్, పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, బాలాజీ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి దీవించండి




కోనేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

పామిడి: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌హన్‌రెడ్డిని మరోసారి సీఎంగా దీవించాలని పార్టీశ్రేణులు కోరారు. శనివారం పార్టీ మండల రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, ఎమ్మెల్యే వైవీఆర్ అల్లుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి బృందాలుగా ఏర్పడి మండలంలోని కత్రిమల, కోనేపల్లి, జీఏ కొట్టాల, దిబ్బసానిపల్లి, రామగిరి ఎగువతండా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై. వెంకట్రామిరెడ్డిని, ఎంపీగా శంకరనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు పెమ్మక చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌నాయక్, బాలనాగమ్మ, పార్వతి, బద్రినాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బీకే రహీమ్, అబ్దుల్‌రజాక్, పార్వతీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 3, 5, 11, 12 వార్డుల్లో ప్రచారం చేశారు. వార్డు ఇన్‌ఛార్జ్‌లు సందీప్‌కుమార్, హరికృష్ణ, ముస్లీం మైనార్టీలు మహబూబ్‌భాష, అబుసాలేహా, జాకీర్, జీ రాజశేఖర్‌రావు, వెంకటేశ్, వెంకటగుప్తా, ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, క్రిష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లు రూరల్: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గత ఐదేళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నిలిపిన జగనన్నకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మండలంలోని కసాపురంలో సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, ఇతర నాయకుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు.

గుత్తి రూరల్: ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ లహరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని ఊటకల్లు, టి.కొత్తపల్లి, వన్నేదొడ్డి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. . కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, బేడల వెంకట్రాముడు, బేడల రమేష్, రంగయ్య, సూర్యనారాయణ, చంద్ర, మల్లయ్యయాదవ్, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, సర్పంచ్ వాసుదేవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, హరికృష్ణ, ఇబ్రహీం పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆదరించండి



ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతిరెడ్డి



ప్రచారంలో ఎమ్మెల్యే చిన్న కూతురు నిషితారెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మికుల పట్ల స్నేహపూర్వకంగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే కుమార్తెలు నైరుతిరెడ్డి, నిషితారెడ్డి కోరారు. శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగ, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ కల్యాణ మండపం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా వైవీఆర్, ఎంపీగా అభ్యర్థి శంకర్‌నారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్ మెహరున్నీసా, వార్డు ఇన్‌చార్జ్ మాచర్ల శివ, నాయకులు మల్లికార్జున శాస్త్రి, యుగంధర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, నాగేంద్ర, బ్రహ్మ, విష్ణు, పాలసుధాకర్, కురుబ శివ, వీరన్న, పాండు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గోవింద్‌నాయక్, శివ, హాజీ తదితరులు పాల్గొన్నారు.

484 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

గుంతకల్లు: స్థానిక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో రెండో రోజు శనివారం 484 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును వినియోగించినట్లు నోడల్ ఆఫీసర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,267 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా ఈ రెండు రోజుల్లో 576 మంది ఓటు వినియోగించుకున్నారన్నారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఆదివారం చివరి రోజు అన్నారు.

50 చీనీ చెట్లు దగ్ధం

కూడేరు: అరవకూరుకు చెందిన రైతు కమ్మే సాలమ్మ పొలం కంచెకు శనివారం నిప్పు అంటుకోవడంతో 50 చీనీ చెట్లు, మోటార్ కేబుల్, పైపులు దగ్ధమయ్యాయి. కోత దశకు వచ్చిన చెట్లు , పైపులు, కేబుల్ కాలిపోవడంతో సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు సాలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు ఆత్మహత్య

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామంలో అప్పులబాధ తాళలేక రైతు మజ్జిగ రామాంజనేయులు (62) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. రైతు తన మూడు ఎకరాలతో పాటుగా మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, ఆముదం, పత్తి పంటలు సాగు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక అప్పులు అధికమయ్యాయి. చేసిన రూ.10 లక్షల అప్పు ఎలా తీర్చాలని మనస్థాపం చెందిన రామాంజనేయులు తన వామిదొడ్డిలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య గతంలోనే మృతి చెందగా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీకి చరమగీతం పాడండి



దేరంగుల ఉదయ్‌కిరణ్

పామిడి: బీసీ కులాల నయవంచకుడు టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎన్నికల్లో చరమగీతం పాడాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ అన్నారు. శనివారం పామిడికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు మాత్రమే చంద్రబాబుకు బీసీలు గుర్తుకు వస్తారన్నారు. మూడుసార్లు అధికారంలో ఉండి కూడా ఆయన బీసీలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. సీఎం జగన్ పాలనలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందన్నారు. సామాజికంగా, రాజకీయంగా బీసీలకు ప్రాధాన్యత కల్పించారన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం అవకాశంతో పాటు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి తిరిగి జగన్ సీఎం చేసి బీసీలు రుణం తీర్చుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నవీన్‌కుమార్‌రెడ్డి



కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఎద్దుల నవీన్ కుమార్ రెడ్డిని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. పార్టీ బలోపేతానికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి, యువనేత ప్రణయ్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు



ఉరవకొండ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్, మాజీ ఎంపీపీలు

ఉరవకొండ: కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక పైప్‌లైన్ కోసం టెండర్లు దక్కించుకుని పనులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్ బొమ్మినేని రామాంజనేయచౌదరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉరవకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పలువురు శనివారం ఫిర్యాదు చేశారు. ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీపార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, ఉపసర్పంచ్ వన్నప్ప మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ధ్యేయంతో శాశ్వత తాగునీటి పథకాలకు విడపనకల్లు మండలానికి రూ.11.56 కోట్లు, ఉరవకొండ మండలానికి రూ.22.54 కోట్లు మంజూరు వేయించారన్నారు. ఇందులో ప్రత్యేకంగా రూ.12 కోట్లు పీఏబీఆర్ డ్యాం నీటిని ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా తీసుకొచ్చి, శాశ్వత నీటి పరిష్కారం చూపాలనుకున్నారన్నారు. టెండర్‌లో బొమ్మినేని రామాంజనేయచౌదరి కాంట్రాక్టు దక్కించుకొని, అగ్రిమెంట్ కూడా చేయించుకొని పనులు చేపట్టాల్సి ఉండగా, పనులు ప్రారంభించలేదన్నారు. అనంతరం ఏఎస్ఐపాల్‌కు వినతిపత్రం అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

విడపనకల్లు: మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామ శివారరులో కర్ణాటక 1,344 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అడిషనల్ సూపరింటెండెంట్ రామకృష్ణ శనివారం తెలిపారు. వి.కొత్తకోట సమీపంలో అదే గ్రామానికి చెందిన దూది నాగరాజు,గుణక బాల రామాంజనేయులు, నింబగల్లు ధనుంజయను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

బలిజ సంఘం గౌరవాధ్యక్షుడి మృతి



వెంకటస్వామి(ఫైల్)

గుత్తి: పట్టణానికి చెందిన బలిజ సంఘం మండల గౌరవాధ్యక్షుడు చింతపండు వెంకటస్వామి(65) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపై బలిజ సంఘం మండల ఉపాధ్యక్షుడు శ్రీకరం గోవిందరాజులు, కార్యదర్శి మంజు, గౌరవాధ్యక్షుడు శ్రీకరం వెంకటేష్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా తదితరులు సంతాపం ప్రకటించారు.

న్యాయవాది మృతి



రవీంద్ర బాబు(ఫైల్)

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన సీనియర్ న్యాయవాది రవీంద్ర బాబు(56) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రవీంద్ర బాబు మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ బాబు, న్యాయవాదులు ఇస్మాయిల్, సతీష్, శ్రీకాంత్‌రెడ్డి, బలిజ సంఘం ఉపాధ్యక్షుడు, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి రమేష్ బాబు తదితరులు సంతాపం ప్రకటించారు.

అంగన్‌వాడీ ఆయా మృతి



నారాయణమ్మ(ఫైల్)

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన అంగన్‌వాడీ ఆయా నారాయణమ్మ(50) మృతి చెందారు. నారాయణమ్మ రెండు రోజులుగా అనారోగ్యం కారణంగా అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. నారాయణమ్మ మృతిపై సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, సుజాత సంతాపం ప్రకటించారు.